క్లుప్తంగా


ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం



వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తున్న రైతు కూలీలు

కోసిగి: జూన్ నెల నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సాగుకు రైతన్నలు విత్తనాలు సంసిద్ధం చేసుకుంటున్నారు. కోసిగి మండలంలో ఖరీఫ్‌లో 17500 హెక్టార్ల భూములు సాగులోకి వస్తాయి. ఇందులో అత్యధికంగా పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి, వరి, ఆముదం, కంది, సజ్జ తదితర పంటలు సాగు చేస్తారు. ఈ మేరకు మండలంలోని పల్లెపాడు, కోసిగి, చింతకుంట, దుద్ది, వందగల్లు, నేలకోసిగి, కొల్మాన్‌పేట, సజ్జలగుడ్డం గ్రామాల్లోని ఇంటి పరిసరాల్లో మహిళా రైతులు వేరుశనగ కాయల నుంచి గింజలను తీసి విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని రైతులు ఆశాజనకంగా ఎదురు చూస్తున్నారు.

ఖాదర్‌లింగ స్వామి ఉరుసుకు ఏర్పాట్లు



కౌతాళంలోని ఖాదర్‌లింగస్వామి దర్గా

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో 320వ ఉరుసు ఘనంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ప్రకటించారు. ఈ నెల 19న ఆదివారం స్వామి సమాధిని సుగంధ పానీయాలు, అత్తర్ వంటి పానీయాలతో (గుసుల్) శుభ్రచేయడం జరుగుతుందని, 20న సోమవారం గంధం, 21న మంగళవారం ఉరుసు ఉత్సవాలు ఉంటాయని, 22న తేదీన (సఫిరాలూట్‌నా) స్వామి ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఉంటుందని, అలాగే 23వ తేదీ గురువారం రోజు జియారత్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులను దృష్టిని ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం



ల్యాబ్‌టెక్నీషియన్‌లకు సూచనలు చేస్తున్న జిల్లా మలేరియాధికారి నూకరాజు

ఆదోని టౌన్: మలేరియా వ్యాధిని, ప్యారాసైట్‌ను గుర్తించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా మలేరియాధికారి నూకరాజు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో హ్యాట్స్ ఆన్ ట్రైనింగ్‌లో ఆయన పాల్గొని ల్యాబ్ టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్త పూతలను తీయడంలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. రోగుల రక్త నమూనాలను భద్రపరచడం, రక్త నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించి పక్కాగా రిపోర్టును అందించాలని సూచించారు. వైద్యరంగంలో అలసత్వం వహించరాదన్నారు. సబ్ యూనిట్ అధికారి మంజు, డాక్టర్ శైనాబేగం పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా బండరాళ్లు

– ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రోడ్డుకు అడ్డంగా వేసిన బండ రాళ్లు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామం నుంచి బొమ్మనపల్లి గ్రామం వెళ్లే రోడ్డుపై కొందరు అడ్డంగా బండరాళ్లు వేయడంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడు రోడ్డు దిగితే వాహనాలు, ఎద్దుల బండ్లు చిక్కుకుంటున్నాయని, ఎప్పుడు ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని భయంభయంగా వెళ్లాల్సి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదారి గుండా పొలాలు సాగు చేసుకోడానికి రైతాంగం ఎక్కువగా వెళ్తుంటారు. రోడ్డుకు అడ్డంగా పెద్ద పెద్ద రాళ్లు వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని రాళ్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం

గూడూరు రూరల్: ఉపాధి హామీలో కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి వేతనం అందుతుందని ఏపీఓ ఈశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని గుడిపాడులో జరుగుతున్న పనులు, కూలీల హాజరును మంగళవారం ఆమె పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి చూపుతున్నామని తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా ఫీల్డుఅసిస్టెంట్లు సూచించిన సమయానికి పని ప్రదేశానికి వెళ్లి నిర్ణీత సమయంలోగా పనులను పూర్తి చేసుకోవాలన్నారు.

ప్రశాంత పోలింగ్ హర్షణీయం



కార్యకర్తతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



మనుమడు, మనుమరాలితో సరదాగా ఎమ్మెల్యే

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పకడ్బందీ చర్యలు చేపట్టి పోలింగ్‌ను విజయవంతం చేసిన పోలీసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఓటర్ దేవుళ్లకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయన మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. తన గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. తన గెలుపు కోసం గ్రామాల్లో రైతులు, అభిమానులు, నారీమణులు, మైనార్టీలు, పట్టణంలోనూ అన్నివర్గాల ప్రజలు ఎంతో సహకరించారని, తనకు ఓట్లు వేశారని తెలిపారు. ఓటర్ దేవుళ్ల రుణం ఎన్నటికీ మరువలేనిదన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానంగా వర్షం కురవడంతో వాతవరణం చల్లబడడం, నారీమణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కష్టపడి పనిచేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళా నాయకురాళ్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వరుసగా రెండోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, సీఎంగా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వర్షం రాక శుభసూచకం

సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వరుణదేవుడు కరుణించాడు. ఒట్టిపోతున్న భూములను తడిపారు. వరుణదేవుడు కరుణించడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చెప్పారు. 2019 ఎన్నికల కౌంటింగ్ రోజున వరుణదేవుడు కరుణించి వర్షం కురిపించారని, అదే మాదిరిగా 2024 ఎన్నికల పోలింగ్ రోజున వర్షం కురవడంతో శుభసూచకంగా భావిస్తున్నట్లు చెప్పారు. రైతుల్లో పట్టలేనంత ఆనందం వెల్లివిరిస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజలు జగనన్నకు మద్దతు నిచ్చాయన్నారు. మహిళలు జగనన్నపై అభిమానం చూపుతూ ఓట్లు వేయడం హర్షించదగ్గ విషయమని, వారి రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదని తెలిపారు.

కుటుంబసభ్యులతో ఉల్లాసంగా ఎమ్మెల్యే

ఆదోనిటౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారంతో ముగిశాయి. ఎన్నికల నేపథ్యంలో 40 రోజులపాటు బిజీబిజీగా గడిపిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆ పర్వం ముగియడంతో మంగళవారం ఇంటిల్లిపాదితో ఉల్లాసంగా గడిపారు. తన వారసులైన గౌతమిరెడ్డి కుమార్తె శ్రేష్ఠారెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి పుత్రుడు అధిరత్‌రెడ్డితో సరదాగా ఆటలాడుకుంటూ వారితో ముచ్చటిస్తూ సరదాగా గడిపారు. సోమవారం జరిగిన పోలింగ్ విషయంపై చర్చించేందుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పట్టణంలోని పలు వార్డులకు చెందిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే నివాసం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యేను పలకరించి ఎన్నికలు జరిగిన తీరును వివరించారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీ వస్తుందంటూ వివరిస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. మరోసారి ఆదోనిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురబోతోందని దిబ్బనకల్, గోనబావి, టీజీఎల్ కాలనీ, కల్లుబావి, శంకర్‌నగర్, 20వ వార్డు ఎస్కేడీ కాలనీ తదితర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పార్టీశ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సాయిప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



పోలింగ్ సరళిపై పార్టీ కార్యకర్తలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

గెలుపుపై ధీమా

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో నాయకుల్లో కాస్త టెన్షన్ తగ్గింది. దీంతో అంతా రిలాక్స్ అయిపోయారు. మంగళవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఆమె భర్త బుట్టా శివనీలకంఠ ఎన్నికల టెన్షన్ వీడి తమ నివాసంలో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. అనంతరం వారు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసానికి వెళ్లి సోమవారం జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. ఇరువురు నేతలు నియోజకవర్గంలో ఏ మండలంలో ఎంత పోలింగ్ జరిగింది. గెలుపుతో పాటు ఎంత మెజారిటీ రావచ్చన్న అంచనాలు వేసుకొంటూ కొద్ది సేపు చర్చించారు. అయితే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాత్రం భారీ మెజారిటీ వస్తుందని ఆమెతో చెప్పినట్లు తెలిసింది. అనంతరం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వీరశైవలింగాత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్‌తో కొద్దిసేపు మెజారిటీపై చర్చించారు. ఆమెను కలిసేందుకు వచ్చిన నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మధ్యాహ్నం వరకు సంతోషంగా మాట్లాడారు. ఏ గ్రామంలో ఎంత మేర పోలింగ్ జరిగింది, తమకు వచ్చే మెజారిటీపై ఆయాగ్రామ నాయకులు వివరిస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తూ వారికి బుట్టారేణుక ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్‌కు ముగిసినందున కౌంటింగ్‌పై చర్చించారు. పోలింగ్‌లో పెద్దఎత్తున పాల్గొని ఓటు వేసి ప్రజలందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



ఉప్పర ఫంక్షన్ హాల్‌లో భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నినదిస్తున్న సంఘ పెద్దలు



ఎమ్మిగనూరులో భగీరథ చిత్రపటానికి పూజలు చేస్తున్న వీరేంద్ర, ఉప్పర కులసంఘ పెద్దలు



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఉప్పర సగర సంఘ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక రామస్వామి ఆలయంలో ఉప్పర కులస్తుల ఆరాధ్య దైవం శ్రీరాముడు, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగీరథ మహర్షి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి వీరేంద్ర పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కోటకొండ నరసింహులు బండల హరి, నరసింహులు, రమేష్, కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర ఫంక్షన్ హాల్‌లో..

పట్టణంలోని ఉప్పర ఫంక్షన్ హాల్‌లో భగీరథ మహర్షి విగ్రహానికి టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, ఉప్పర సగర సంఘ పెద్దలు యు.రంగన్న, ఏపీ వీరన్న, బసరకోడు రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు నగేష్, శ్రీధర్, రామచంద్ర, యాటీవై కృష్ణ, వినయ్, యు.రాము, రాముడు, శంఖర్నాథ్, గోకారి తదితరులు పాల్గొన్నారు.

కోసిగి మండలంలో 84.11 శాతం పోలింగ్



వందగల్లులో సాయంత్రం 6.40 గంటలకు ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు

కోసిగి: సార్వత్రిక ఎన్నికల్లో కోసిగి మండలంలో 84.11 శాతం పోలింగ్ శాతం నమోదైంది. మండలంలో మొత్తం 55908 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 47025 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 84.11 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా పెద్దభూంపల్లి గ్రామంలో 662 మంది ఓటర్లకు గానూ 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 97.13 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా కోసిగి 112 పోలింగ్‌బూత్‌లో 955 మందికి గానూ 684 మంది ఓట్లు వేయగా 71.62 శాతం నమోదైంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఉదయం 7గంటల నుంచి రాత్రి వరకు ఓటర్లు క్యూలైన్‌లో వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వందగల్లు, కందుకూరు, చిన్నభూంపల్లి, చిర్తనకల్లు, ఆర్లబండ, గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు వేచి ఉండి ఓటర్లు తమ ఓటు వేశారు. గతంలో కంటే ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

22 నుంచి ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ఈ నెల 22వ తేదీ నుంచి జరుగుతాయని ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న మంగళవారం తెలిపారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థినులకు బుధవారం నుంచి అప్లికేషన్ ఫారంలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఒక్కో గ్రూపులో ఇంగ్లిషు, తెలుగు మీడియం కలిపి 88 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మే 22వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు జూన్ 10వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌతాళంలో రికార్డు స్థాయి పోలింగ్



ఓటు వేసేందుకు తరలివచ్చిన ప్రజలు

కౌతాళం: మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 69 పోలింగ్ బూతుల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు పోటెత్తడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా 84.44 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. ఇంత పెద్ద స్థాయిలో ఓటర్లు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం శుభపరిణామం అని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. మండలంలో 58,544 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 28,610 మంది, మహిళా ఓటర్లు 29,925 మంది ఉన్నారు. 9 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఇందులో సోమవారం జరిగిన పోలింగ్‌లో పురుషులు 24,699 మంది, మహిళలు 24,734 మంది, ఇతరులు ఇద్దరు కలిపి మొత్తం 49,435 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని మేళిగనూరులో 92.81 శాతం మంది ఓట్లు వేశారు. అలాగే కుంబళనూరులో 91 శాతం, తిప్పలదొడ్డి, దంబలదిన్నె గ్రామాల్లో 92 శాతం, కరణి, ఓబుళాపురం గ్రామాల్లో 90 శాతం, మల్లనహట్టి 88.42 శాతం, బంటకుంటలో 87.89 శాతం, మరళిలో 87 శాతం పోలింగ్ జరిగింది.

నియోజకవర్గంలో ఇలా..

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 2,08,350 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 87,808 మంది, మహిళలు 87,848 మంది, థర్డ్ జెండర్ 11 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,75,667 మంది ఓటు వేశారు. మొత్తం 84.31 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో అత్యధికంగా కోసిగి మండలంలోని పెద్దభూంపల్లిలో 97.13 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే పెద్దకడుబూరు మండలంలోని హులికన్విలో 95.85 శాతం ఓట్లు పోలయ్యాయి. హనుమపురంలో 93 శాతం, నెల కోసిగిలో 91.72, జుమ్మలదిన్నెలో 91.45, గూడ్‌గల్‌లో 91.74 శాతం, పికలబెట్టలో 94.48 శాతం పోలింగ్ నమోదైంది. గంగులపాడులో 93.23 శాతం, రాగిమాన్‌దొడ్డి 92.81 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.


సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

మద్దికెర: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం షష్టి పురస్కరించుకొని విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడైన స్వామి వారికి అర్చకులు హోమాలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు, ప్రసాదం, అన్నదానం పంపిణీ చేశారు.

నేడు ఇనగండ్లలో దేవర



సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్ల ఆలయాలు, దేవతామూర్తులు, గ్రామ శివారులోని చౌడమ్మను మంగళవారం సుందరంగా అలంకరించారు. అర్ధరాత్రి అనంతరం గ్రామోత్సవం నిర్వహించి, బుధవారం తెల్లవారుజామున కుంబ కాగులను ఆలయాలకు చేర్చి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

టీబీ డ్యాంలో 3.4 టీఎంసీల నీరు నిల్వ

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రదాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. డ్యాంలో నీరు లేక కళ తప్పగా ఎల్లెల్సీ బోసిపోతోంది. ఆంధ్రకు సంబంధించి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాం గడిచిన నాలుగేళ్లుగా ముందస్తు వర్షాలతో జూలై ముందుగానే పూర్తి స్థాయిలో నిండి పలు సార్లు డ్యాం గేట్లు ఎత్తి నదికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో డ్యాంలో నీటి నిల్వ అడుగంటింది. ఈ ఏడాదైనా ముందస్తు వర్షాలు కురువాలని రైతులు ఎదురు చూస్తున్నారు. టీబీ డ్యాంలో మంగళవారం నాటికి 1,633 అడుగులకు గానూ 1,577.60 అడుగులతో 105,788 టీఎంసీలకు గాను 3.415 టిఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో కాగా, అవుట్ ఫ్లో 13 క్యూసెక్కులుంది.

నందవరంలో పెరిగిన పోలింగ్ శాతం



నందవరంలోని ఆదర్శ పోలింగ్ కేంద్రం

నందవరం: సార్వత్రిక ఎన్నికలలో నందవరం మండలంలో పోలింగ్ శాతం పెరిగింది. ఓటర్లల్లో చైతన్యం పెరగడంతో గతం కంటే 16 శాతం ఓటింగ్ పెరిగింది. సోమవారం జరిగిన ఎన్నికలలో నందవరం మండలంలో 86.59 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 47,287 మందికిగానూ 40,950 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురషులు 20,621, మహిళలు 20,326 మంది, థర్డ్‌జెండర్ ముగ్గురు ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. అత్యధికంగా పెద్దకొత్తిలి గ్రామ పంచాయతీ పరిధిలో 95.12 శాతం, తక్కువగా సోమలగూడూరు గ్రామంలో 80.81 శాతం పోలింగ్ జరిగింది.

ఆదర్శ కేంద్రంలో 83.60 శాతం పోలింగ్

మండల కేంద్రం నందవరంలో అధికారులు ఆదర్శ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కేంద్రాన్ని పూలు, రంగురంగుల ముగ్గులతో మామిడి తోరణలు, కలర్ బెలూన్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. ఓటర్లకు స్వాగతం పలుకుతూ ఏర్పట్లు చేశారు. ఈ కేంద్రంలో సోమవారం 83.60 శాతం పోలింగ్ జరిగింది. ఓటు హక్కుపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగింది. ఈ కేంద్రంలో 957 మందికిగాను 801 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రభుత్వ బడులకు మహర్దశ

- పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో వసతుల కల్పన
- అంచనాలు పంపిన అధికారులు
- ఆధునిక బోధనా వసతులు, ప్రయోగశాలలకు నిధులు
- మారనున్న బడులు రూపురేఖలు



నిర్మాణంలో ఉన్న ఖోఖో కోర్టు



ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించి ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు పీఎం శ్రీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సకల సౌకర్యాలు కల్పించడంతో ఆయా బడులకు మహర్దశ పట్టనుంది. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి డివిజన్‌లో 18 పాఠశాలలు ఎంపిక కాగా ఆదోనిలో రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో పెద్దహరివాణం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. పెద్దహరివాణం పాఠశాలలో కబడ్డీ కోర్టు నిర్మాణం చేపడుతుండగా, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఖోఖో కోర్టు నిర్మిస్తున్నారు. అంతే కాకుండా ఎంపిక చేసిన పాఠశాలల్లో ల్యాబొరేటరీలతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వృత్తి విద్యా కోర్సులు అందించనున్నారు. తొలిదశలో ఎంపికైన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు కేంద్రం నిధులను విడుదల చేయనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా కింద 40 శాతం నిధులు చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ నూతన విద్య విధానం అమలులో భాగంగా ఆధునిక విద్య కేంద్రాలుగా పాఠశాలలను తీర్చిదిద్దనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు అధికారులు అంచనాలను సిద్ధం చేశారు.

సదుపాయాలు ఇలా

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల ప్రాంగణంలోనే కూరగాయలు, ఆకుకూరల సాగు, కాలుష్యానికి తావు లేకుండా గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మాణాలను చేపట్టడంతో టాయిలెట్లు, గ్రంథాలయం, సౌర విద్యుత్ వ్యవస్థ వంటివి ఉండే విధంగా ప్రణాళికలను రూపొందించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, డిజిటల్ లైబ్రరీ, విద్యార్థులను క్రీడల్లో ప్రొత్సహించేందుకు అవసరమైన అన్ని రకాల క్రీడా సామగ్రిని అందించనున్నారు. కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడతారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను పక్కాగా ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్నికైన పాఠశాలలపై జిల్లా కలెక్టర్ పర్యవేక్షణతో పాటు స్థానిక సంస్థల భాగస్వామ్యం ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం చేశాం



పీఎంశ్రీ పథకం కింద ఎంపికై న పాఠశాలల్లో కబడ్డీ కోర్టు నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. పాఠశాలల ఆవరణలోనే కబడ్డీ కోర్టు నిర్మాణాలను చేపడుతున్నారు. ఇతర వసతులు, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు వంటి వాటి కోసం ప్రణాళికలను సిద్ధం చేసి అధికారులకు పంపాం. పాఠశాలల్లోని తరగతి గదులు, విద్యార్థులు, వసతి సౌకర్యాలపై సమగ్ర వివరాలతో ఆన్‌లైన్‌లో వివరా లుపొందిపరిచాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మిగతా పనులు కూడా చేపడతాం.

– వెంకటరమణారెడ్డి, ఉప విద్యాధికారి

తరగతుల నిర్వహణ

పీఎంశ్రీ పథకం కింద ఏర్పాటు చేయనున్న కంప్యూటర్ల ద్వారా ఎంపికైన పాఠశాలల్లో క్లౌడ్ మేనేజ్‌మెంట్ విధానంలో ఫ్యాకల్టీలను తీసుకొని వారి ద్వారా విద్యార్థులకు తరగతులను బోధించనున్నారు. దీంతో నూతన విద్యా విదానంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులకు వర్చువల్ రియాలిటీలో అవగాహన కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.